నిధికోసం
ఇల్లు గుల్లచేసిన
వారికి తెలిసిన
నిజం!

# ఆశకు పోతే




అదొక పెద్ద హాలు.

ఆ హాలుకు రెండువైపులా రెండు బెడ్‌రూములు, వెనుకవైపున కిచెన్. ఆ హాలులో ఒక ప్రక్కన బల్లమీద పరంధామయ్యగారు అంటే ఆ ఇంటి యజమాని పడుకుని వున్నారు.

పాపం పరంధామయ్యగారు వారం రోజులనుండి దగ్గు, దమ్ము, జ్వరంతో బాధపడుతూ వున్నారు. ఆ ఇంట్లోని వారందరూ మాత్రం అంటే ఇద్దరు కొడుకులు, కోడళ్లు, ఇద్దరు కూతుళ్లు, అల్లుళ్లు తెగ ఆనందపడిపోతున్నారు. ఎందుకో తెలుసా? (ఎందుకేంటి ముసలాయన పోతున్నారు. పీడ విరగడ అవుతందని మాత్రం మీరనుకుంటే పప్పులో కాలేసినట్లే సుమా) ఆ ఇంట్లో తాతల కాలంనుండి నిధి వుందని, ఆ నిధి వివరాలు పరంధామయ్యకు తెలుసని వారి నమ్మకం. ఆ నిధి అంతా ఇంతా కాదు మరి. ఐదొందల కిలోల బంగారం, వెయ్యికిలోల వెండి దాదాపుగా వుంటుందని అంచనా! పాపం ఆ నిధికి ఆశపడే ఆయనగారి చిన్నకూతురిని కాణీ కట్నం లేకుండా చేసుకున్నారు ఆయనగారి చిన్నల్లుడు. అంతేకాకుండా ఆ నిధి వివరాలు జానకమ్మగారికి కూడా తెలుసని, జానకమ్మగారంటే పరంధామయ్యగారి భార్యామణి ఆడవాళ్లనోటినుండి త్వరగా తెప్పించవచ్చునని ఆశపడి కోడళ్లు, కూతుళ్లు ఒకరికి మించి ఒకరు పోటీపడి మరీ ప్రేమగా చూశారు. పాపం మితిమీరిన ప్రేమతో మితిమీరి తిండి పెట్టడంతో అజీర్ణవ్యాధితో జానకమ్మగారు మరణించారు. అలాంటి పొరపాటు మాత్రం పరంధామయ్యగారికి కలుగనివ్వడంలేదు.



హఠాత్తుగా నిద్రలో చనిపోతే ప్రాబ్లమ్ కనుక చివరికి దేవుడు వారి మొర ఆలకించి పరంధామయ్యగారు మంచంపట్టారు. దాంతో ఇంటిల్లిపాదికి ఆలోచనలతో నిద్రపట్టడంలేదు సుమండీ. ఆ నిధి తమ చేతికి అందాక ఏమేమి చేయాలో ముందుగానే అంచనా వేసుకుంటున్నారు. పెద్దకొడుకేమో గుర్రప్పందాల్లో పెట్టి ఇంకా పెంచాలని, పెద్ద

కోడలేమో తనకు నాలుగుజతల గాజులు, ఓ నాలుగు జతల గొలుసులు వడ్డాణం, ఓ పది జతల చెవ్వులవి చేయించుకుందామని, రెండవ కొడుకు వచ్చే నిధితో సినిమా టాకీసు, ఓ లాడ్జి కట్టాలని, పెద్దల్లుడేమో తనకున్న ప్లాట్ల పక్కకు మరికొన్ని అంటే మరో యాభై ప్లాట్లు కొనాలని, పెద్దకూతురేమో తన పేరుమీద ఓ ఐదు లక్షలు, భర్త పేరుమీద ఐదు లక్షలు, పిల్లల పేరుమీద తలకో రెండు లక్షలు బ్యాంకులో వేయాలని, చిన్నల్లుడేమో తనకున్న ద్రాక్షతోట ప్రక్క మరో పది ఎకరాల ద్రాక్షతోట కొనాలని, చిన్నకూతురేమో ఒక పదంతస్తుల బిల్డింగు కట్టి, ఓ కారుకొని ఇంట్లోకి ప్రతి విలాస వస్తువు కొనుక్కోవాలని, ఇలా ఎవరి ఆలోచనల్లో వాళ్లుండగా కెవ్వుమన్న కేక విని రావడంతో అందరూ ఒక్కసారే అదిరిపడి ఆ కేక పరంధామయ్యగారిదే అని తెలుసుకుని పరుగుపరుగున అందరూ పరంధామయ్యగారి చుట్టూ చేరారు.

కోడళ్లు ఇద్దరూ కాళ్లు అదుముతూ, కూతుళ్లు ఇద్దరూ చేతులు అదుముతూ, కొడుకులు, అల్లుళ్లు పరంధామయ్యగారికి ఇరువైపుల కూర్చుని చెప్పండి నాన్నగారు, ఏమన్నా చెప్పండి మామగారు. ఏమైంది మామగారు ఏమైంది నాన్నగారు అంటూ పరామర్శించసాగారు. కాని పాపం చెప్పడానికి పరంధామయ్యగారి నోటిమాట పడిపోయింది. దాంతో పాపం బిక్కచచ్చినట్టయింది అందరికీ. కానీ పాపం పరంధామయ్యగారు మెల్లగా కుడిచెయ్యి పైకి లేపి ఉత్తరం వైపుగా గోడకు చూపాడు దాంతో కొడుకులు, అల్లుళ్లు గడ్డపారలు తెచ్చి గోడలను పగులగొట్టారు. కానీ ఏమీ లేదు. పరంధామయ్యగారు నెత్తి బాదుకుంటూ పశ్చిమంవైపు గోడను చూపగా అటువైపు పగలగొట్టారు. ఏమీ లేదు.

పరంధామయ్యగారు మళ్లీ నెత్తి బాదుకుంటూ దక్షిణంవైపు గోడను చూపించగా ఆ వైపుగోడను పగలగొట్టినా ఏమీ లేదు. దాంతో అందరూ సమావేశమై ఎంత ఖర్చయినా ఫరవాలేదు. పరంధామయ్యగారికి మాట రప్పించాలని నిశ్చయించి పెద్దకోడలు గొలుసు, చిన్న కోడలుని ఇంకా మడత విప్పని మూడు కంచిపట్టు చీరలు, పెద్దల్లుని ప్లాటు, చిన్నల్లుని ద్రాక్షతోట అమ్మి తిరగవలసిన అన్నిచోట్ల తిరిగి ఎలాగైతేనేం పరంధామయ్యగారి మాట రప్పించారు. మాట రాగానే పరంధామయ్యగారిచుట్టూ చేరి నిధి ఎక్కడ వుందని డిగారు.

''నిధా పాడా గోడలకు సున్నాలు వేయించక చాలా రోజులైంది. గోడలన్నీ పాడైపోతున్నాయని, సున్నాలు వేయించమని చూపించా అంతే!'' అన్నారు చల్లగా ది గ్రేట్ ఎనభై ఏళ్ల పరంధామయ్యగారు.

'అంతే అందరూ మూర్ఛపడిపోయారు పాపం!

*